


# జిహెచ్ఎంసిలో ఏం జరుగుతోంది?

☛ ఇంటెలిజెన్స్‌పేరుతో పలువురు ఉద్యోగులకు కాల్స్
☛ జాబ్‌వివరాలు, ఆధార్, ఆస్తుల వివరాల సేకరణ
☛ తమతో మాట్లాడింది ఎవరో తేల్చుకోలేక ఉద్యోగుల్లో టెన్షన్

**హైదరాబాద్,జూలై 16,ప్రభాతవార్త:** జీహెచ్ఎంసీలో ఇటీవల అవినీతి తిమింగలాలు ఒకొక్కటిగా భయటపడుతున్న నేపథ్యంలో ఆ యాశాఖలపై ఇంటలిజెన్స్ వర్గాలు దృష్టిపెట్టినట్లు తెలుస్తుంది.గడిచిన అయిదు నెలల వ్యవధిలో అయిదుగురు అధికారులు లంచాలు తీసుకుంటూ ఏసిబికి పట్టుబడిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో దర్యాప్తు సంస్థలు దృష్టిసారించినట్లు తెలుస్తుంది. గతంలో అడ్డదారిలో బర్త్, డెత్ సర్టిఫికెట్లు జారీ అయిన నేపథ్యంలో నిజం నిగ్గ తేల్చేందుకు అప్పటి కమిషనర్ ఇలంబర్తి ఇంటెలిజెన్స్ విచారణకు ఆదేశించి సంగతి తెల్సిందే. కానీ విచారణ చేపట్టిన ఇంటెలిజెన్స్ నివేదికలను కూడా సమర్పించటం, దాన్ని ప్రకారం చర్యలు తీసుకోవటం కూడా జరిగిపోయిన తర్వాత జీహెచ్ఎంసీలోని కొందరు అదనపు కమిషనర్ల ఛాంబర్లలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్స్ సిబ్బందికి ఇప్పటికీ ఇంటెలిజెన్స్ అధికారులమంటూ ఫోన్లు వస్తున్నట్లు సిబ్బంది వాపోతున్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న సీట్లో ఎన్ని సంవత్సరాల నుంచి పని చేస్తున్నారు? గత సర్కారు హయాంలో ఎక్కడ పని చేశారు? మీ ఆధార్ కార్డు కాపీ పంపాలని, మీరు చెప్పినా, చెప్పకపోయినా మీ ఆస్తుల వివరాలు మా వద్ద ఉన్నాయంటూ ఫోన్ లో చెబుతున్నట్లు సిబ్బంది వాపోయారు. ఈ ఫోన్లకు బెంబేలెత్తిన కొందరు ఉద్యోగులు భయపడి ఆధార్ కార్డు కాపీని పంపినట్లు, మరి కొందరు పంపేందుకు వెనకంజ వేస్తున్నట్లు తెలుస్తుంది. నిజంగానే ఇంటెలిజెన్స్ విచారణ జరుగుతుందంటే ఏ తప్పు చేయని తాము భయపడకుండా తమకు తెలిసిన సమాచారమిచ్చి, సహకరిస్తామని, కానీ సైబర్ నేరగాళ్ల కుట్ర అయితే ఎలా? అంటూ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తుంది. గడిచిన అయిదారు నెలల్లో జీహెచ్ఎంసీలోని పర్మినెంట్, ఔట్ సోర్స్ ఉద్యోగుల్లో సుమారు వెయ్యి మందికి ఇలాంటి కాల్స్ వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం జీహెచ్ఎంసీలోని కొందరు ఔట్ సోర్స్, పర్మినెంట్ ఉద్యోగులకు ఇంటెలిజెన్స్ అధికారులమంటూ ఫోన్లు రావటం పై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా అడ్డదారిలో బర్త్, డెత్ సర్టిఫికెట్లకు సంబంధించి అప్పట్లో విచారణ చేపట్టిన ఇంటెలిజెన్స్ ఔట్ సోర్స్ కంప్యూటర్ ఆపరేటర్లను తమ నివాసాలకు వెళ్లి విచారించి, మరీ సమాచారాన్ని రాబట్టిన తర్వాతే నివేదికలను సమర్పించటం,అడ్డదారిలో సర్టిఫికెట్లు జారీ అయిన మలక్ పేట, ఫలక్ నుమా సర్కిళ్లలో సంబంధిత హెల్త్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించిన తర్వాత కూడా ఇంటెలిజెన్స్ విభాగం అధికారులమంటూ జీహెచ్ఎంసీ సిబ్బందికి ఫోన్లు రావటం పట్ల పర్మినెంట్, ఔట్ సోర్స్ ఉద్యోగుల్లోనూ ఆందోళన నెలకొంది. నిజంగానే ఇంటెలిజెన్స్ విభాగం జీహెచ్ఎంసీపై ఫోకస్ చేసిందా? లేక ఇంటెలిజెన్స్ విభాగం అధికారులమంటూ సైబర్ నేరగాళ్లు ఏమైనా ప్లాన్ చేస్తున్నారా? అన్నది మిస్టరీగా మారింది. పైగా గత సర్కారు హయాంలో మీరు ఎక్కడ పని చేశారంటూ ప్రశ్నించటం పట్ల జీహెచ్ఎంసీలో రోజురోజుకి పెరిగిపోతున్న అవినీతికి అడ్డకట్ట వేసేందుకు సర్కారు ఏమైనా రహస్య ఇంటెలిజెన్స్ విచారణ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## లాలాగూడలోని కేంద్రీయ ఆసుపత్రి తనిఖీ



హాస్పిటల్లో రోగితో మాట్లాడుతున్న జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

**తార్నాక, జులై 16 ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బుధవారం సికింద్రాబాద్ లాలాగూడలోని కేంద్రీయ రైల్వే హాస్పిటల్‌ను తనిఖీ చేశారు. ఈ తనిఖీ సమయంలో ఆయనతో పాటు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మల రాజారాం, హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, సెంట్రల్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ. శివనాగ ప్రసాద్, సీనియర్ వైద్యులు, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఓల్డ్ ఔట్‌పేషెంట్ బ్లాక్ (ఓ.పి.డి)లోనున్న ఆప్తోమాలజీ, డెంటల్, ఈ.ఎన్.టి, చెస్ట్ క్లినిక్ లను తనిఖీ చేశారు. జనరల్ మేనేజర్ కొత్త ఓ.పి.డి బ్లాక్‌లో, రేడియాలజీ యూనిట్, డాక్టర్ల కన్సల్టేషన్ గదులు, రిటైర్డ్ ఉద్యోగుల వెయిటింగ్ లాంజ్‌లను తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న చికిత్సకు సంబంధించిన సౌకర్యాల గురించి ఆయన పెన్షనర్లు, కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించడానికి అదనంగా కావాల్సిన సౌకర్యాల గురించి అభిప్రాయాన్ని వారినుండి తీసుకున్నారు. జనరల్ మేనేజర్ అత్యవసర వార్డు (క్యాజువల్టీ), స్పెషల్ వార్డు, ఇంటెన్సివ్ కరోనరీ కేర్ యూనిట్ (ఐ.సి.సి.యూ), డయాలసిస్ యూనిట్, నూతనంగా ప్రారంభించబడిన కార్డియాక్ క్యాత్ ల్యాబ్ రికవరీ రూమ్‌ను తనిఖీ చేశారు. జనరల్ మేనేజర్ శుభ్రత, పని వాతావరణాన్ని పరిశీలించారు. కొంతమంది రోగులతో సంభాషించారు.వారికి అందుతున్న సౌకర్యాలు మరియు చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. వీటితోపాటు పురుషుల మెడికల్ వార్డులు, ప్రసూతి వార్డు శిశువులకు సంబంధించిన నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్.ఐ.సి.యూ) మొదలైన వాటిని ఆయన తనిఖీ చేశారు.

## రోడ్డు సమస్యను ఎంపి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం

**- కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి**



బైరాగిగూడ-నార్సింగి రోడ్డును పరిశీలిస్తున్న కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి.

**నార్సింగి, జూలై 16 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని బైరాగిగూడ-నార్సింగి రోడ్డు సమస్యను ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని రాజేంద్రనగర్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆర్మీ పరిధిలో ఉన్న బైరాగిగూడ-నార్సింగి రోడ్డును స్థానిక ప్రజలు, బిజెపి నాయకులతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మీ పరిధిలోకి వచ్చే ఈ రోడ్డు దశాబ్దాల నుంచి మట్టి రోడ్డుగానే ఉందని, ఫలితంగా వర్షాకాలంలో గుంతలు పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రయాణీకుల ఇబ్బందులు శాశ్వతంగా తీర్చాలంటే ఇక్కడ థార్‌రోడ్డు వేసేందుకు అనుమతించాలని ఆర్మీ అధికారులను కోరుతామన్నారు. ప్రజల ఇబ్బందులను త్వరగా పరిష్కరించేందుకు బిజెపి ముందుంటుందన్నారు. అలాగే వందలాది మంది ప్రజలుండే గంధంగూడలో సివరేజీ ప్లాంటును ఏర్పాటు చేయవద్దని జల మండలి అధికారులపై ఒత్తిడి తీసుకు వస్తామని శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి అధ్యక్షులు మహేష్ యాదవ్, సీనియర్ నాయకులు మహాలింగంగౌడ్, పిఎస్. మల్లారెడ్డి, దామోదర్‌రెడ్డి, ప్రశాంత్ నాయక్, శేఖర్ ముదిరాజ్, శ్రీనివాస్, నర్సింగ్‌రావ్, పవన్‌సాయి, అర్జున్, శివలీల, భాగ్య, ప్రదీప్‌గౌడ్ పాల్గొన్నారు.

## దిల్‌షుక్‌నగర్ కాల్పుల కేసులో దర్యాప్తు ముమ్మరం

**మలక్ పేట, జూలై 16, ప్రభాతవార్త:** దిల్ షుక్ నగర్ కాల్పుల కేసులో పోలీసులు విస్తృతంగా దర్యాప్తు చేస్తున్నారు. దిల్ షుక్ నగర్ శాలివాహన నగర్ పార్క్ వద్ద మంగళవారం ఉదయం నలుగురు దుండగులు కళ్ళల్లో కారం కొట్టి జరిపిన కాల్పులలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ చందు నాయక్ రాథోడ్ అక్కడికక్కడే మృతి చెందిన విషయం విధితమే. హయత్ నగర్ కుంట్లూరు గుడిసెల విషయంలో రాజేష్ , సుధాకర్, భాష, చందు నాయక్ ల మధ్య గొడవలు జరిగి విభేదాలు తలెత్తినట్లు సమాచారం. పాత కక్షలు, భూ వివాదాల నేపథ్యంలోనే హత్య జరిగి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. చందు నాయక్‌ను హత్య చేసిన సంఘటనలో రాజేష్, ప్రశాంత్, ఏడుకొండలు తదితరులు ప్రధాన పాత్ర పోషించారని , మిగిలిన ఐదుగురు సుధాకర్, రాయుడు, మున్నా , రవీంద్ర చారి, యాదిరెడ్డిలు సహకరించారని తెలిసింది. నిందితులను పట్టుకోవడం కోసం పది బృందాలను ఏర్పాటు చేసినట్లు ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ వివరించారు. హత్య ఉదాంతం పై అన్ని కోణాలలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని ఇన్ స్పెక్టర్ పీడమర్తి నరేష్ పేర్కొన్నారు.

## షాపులు కోల్పోతున్న వారికి అండగా ఉంటాం

**: జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

**పేట్ బషీరాబాద్, జూలై 16, ప్రభాతవార్త**

రోడ్డు విస్తరణలో భాగంగా షాపులు కోల్పోతున్న వారికి అండగా ఉంటామని జిల్లా ఇన్చార్జ్ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కొంపల్లి మున్సిపల్ దూలపల్లి ప్రధాన రోడ్డు ప్రస్తుతం 60 ఫీట్లు ఉంది. జనాభా పెరుగుదల వాహనాల రద్దీ దృష్ట్యా 100 ఫీట్ల రోడ్డు విస్తరణ చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు ఇటీవల వారం రోజుల్లో ఖాళీ చేయాలని 116 మంది షాపు యజమానులకు నోటీసులు అందజేశారు. షాపులు కోల్పోతున్న వారికి ఎలాంటి పారితోషకం ఇవ్వమని అధికారులు కరాకండిగా చెప్పడంతో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహాయంతో మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై బుధవారం సాయంత్రం దూలపల్లిలో షాపులు కోల్పోతున్న యజమానులు, కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, స్థానిక తహసిల్దార్ మతిన్‌లతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ రేట్ ప్రకారం డబ్బులు ఇప్పించాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రెండు రోజుల్లో హెచ్ఎండిఏ అధికారులతో సమావేశమై రోడ్డు కోల్పోతున్న వారికి పారితోషకము, ఇల్లు మొత్తం కోల్పోతున్న వారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కున శ్రీశైలం గౌడ్, నియోజకవర్గ ఇన్చార్జ్ కొలను హన్మంత్ రెడ్డి, మెదక్ జిల్లా డిసిసి అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, భూపతి రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ గరిసే నరేందర్ రాజ్‌లు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అమ్మ వారికి శాకాంబరి పూజలు

**చార్మినార్,జూలై 16 ప్రభాతవార్త :** ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని మీరాలం మండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయంలో బుధవారం అమ్మ వారికి శాకాంబరి పూజలు అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగాయి.ఆనవాయితీ ప్రకారం ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడ పలు రకాల కూరగాయలు, ఆకు కూరలతో అమ్మ వారి విగ్రహంతో పాటు దేవాలయాన్ని అకర్షణీయంగా అలకంరించారు.ఈ సందర్భంగా దేవాలయం కమిటి చైర్మన్ గాజుల అంజయ్య మాట్లాడుతూ మీరాలంమండిలో అత్యంత వైభవంగా బోనాల జాతర ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.కాగా శాకాం బరి ప్రత్యేక పూజలో పాతబస్తీకి చెందిన భక్తులు అమ్మ వారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.బుధవారం సాయంత్రం పురానీహవేలి,పీలి పాఠక్ నుంచి తొట్టెల ఊరేగింపు మీరాలం మండిలోని దేవాలయం వరకు వైభవంగా కొనసాగింది. ఈకార్యక్రమంలో దేవాలయం కమిటి చైర్మన్ గాజుల అంజయ్యతో పాటు కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.

## అదనపు అంతస్తుల నిర్మాణం సీజ్



**అత్తాపూర్ జూలై16,ప్రభాతవార్త :** అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ హెచ్చరించారు.బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పర్‌పల్లి ,జనచైతన్య కాలనీ విల్ నెం 36లో అఫ్జల్ నవాజ్ ఖాన్ అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న 3వ అంతస్తు,4వ అంతస్తులోని పెంట్ హౌస్‌ను టౌన్‌ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. డిసి మాట్లాడుతూ....నిర్మాణానికి సంబంధించిన యజమానికి షోకాజ్ నోటీసు,స్పికింగ్ ఆర్డర్ ఇచ్చిన విన్నకుండా భవన నిర్మాణ పూర్తి చేయడానికి ప్రయత్నం చేస్తున్నాడని జిహెచ్ఎంసి ఆదేశాలను బేఖాతరు చేయడంతో 3వ అంతస్తు,4వ అంతస్తులలోని పెంట్ హౌస్‌ను సీజ్ చేయడం జరిగిందని ప్రతి ఒక్కరూ జిహెచ్ఎంసి నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# హైదరాబాద్ వార్త

## క్లీన్ అండ్ గ్రీన్‌సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు సహకరించాలి

**-జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**



వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటుతున్న మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఆర్.వి.కర్ణన్

**హైదరాబాద్, జూలై 16, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ ప్రణాళికబద్ధంగా కృషి చేస్తుందని, ఇందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనీ కూకట్ పల్లి జోన్ షిరిడి హిల్స్ కాలనీలో కమిషనర్ ఆర్ వి కర్ణన్‌తో కలిసి వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. మొక్కల నీటి అవసరాలకు ఉద్దేశించిన బోరు మోటారు ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ వన మహోత్సవం లో భాగంగా ఈ సంవత్సరం ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా భాగస్వామ్యంతో 25 లక్షల మొక్కలను నాటడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని ఈసీజన్ మొత్తం మొక్కలు నాటుతామని తెలిపారు. ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేస్తామని మొక్కలు నాటడం లో నగర పౌరులు క్రియాశీకల భాగస్వామ్యం కావాలన్నారు. ప్రతి ఒక్క పౌరుడు "ఏక్ ఫేడ్... మాకే నామ్" అనే నినాదంతో తమ తల్లి పేరుతో ఒక్కో మొక్క నాటాలన్నారు. మొక్కలను నాటడమే కాదు వాటి సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.మొక్కలు నాటడం వల్ల పిల్లలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించినవారమవుతామన్నారు. ఆకుపచ్చని హైదరాబాద్ లక్ష్యంగా గ్రేటర్ పరిధిలో వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఆర్ వి కర్ణన్ తెలిపారు. వార్డుల వారిగా వనమహోత్సవం లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రభుత్వ టార్గెట్ ను పూర్తి చేస్తామని అన్నారు. మొక్కల నాటడం పైనే కాకుండా వాటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో భాగస్వామ్యమైన విద్యార్థులు " గో గ్రీన్" అంటూ నినాదాలు చేయగా వారితో కలిసి మేయర్, కమిషనర్లు ఫోటోలు దిగి అభినందించారు. ఈకార్యక్రమంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, అదనపు కమిషనర్ సుభద్రా దేవి, కార్పొరేటర్ రావుల శేషగిరిరావు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ మోడల్ కాలనీ కొరకు జాయింట్ సర్వే చేపట్టాలి

**-స్లమ్ ఏరియాలలో సర్వే నిర్వహించి నివేదికలు అందించాలి**

**-గృహ నిర్మాణ శాఖ ఎండి గౌతమ్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ గౌతమ్, కలెక్టర్ హరిచందన దాసరి, అనురాగ్‌జయంతి తదితరులు

**హైదరాబాద్,జూలై 16,ప్రభావార్త:** హైదరాబాద్ జిల్లాలోని ఇందిరమ్మ మోడల్ కాలనీ చేపట్టుటకు జిహెచ్ఎంసి రెవెన్యూఅలాగే హౌసింగ్ అధికారులు స్లం ఏరియాలలో జాయింట్ సర్వే చేసి నివేదిక అందించాలని గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ అధికారులకు సూచించారు. బుధవారం హైదరాబాద్ జిల్లాలోని నియోజకవర్గాల వారీగా చేపట్టే ఇందిరమ్మ మోడల్ కాలనీల నేపథ్యంలో గుర్తించినటువంటి స్లం ఏరియాలలో జాయింట్ టీం సర్వే చేపట్టి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వివరాలు అందజేయాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇండ్లు మంజూరు కాగా జిల్లాలలో దాదాపు లక్ష యాభై వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లాలోని ఇందిరమ్మ మోడల్ కాలనీలో నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన 106 స్లం ఏరియాలలో తాత్కాలికంగా నిర్మించుకున్న ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి జాయింట్ టీం వచ్చే శనివారం నాటికి నివేదిక అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో 3500 చొప్పున ఇల్లు నిర్మించేందుకు సంసిద్ధంగా ఉందని జాయింట్ టీం పక్కాగా సర్వే చేసి వచ్చే శనివారం నాటికి నివేదికలు అందించాలని ఆమె ఆదేశించారు. అదేవిధంగా గుర్తించిన లబ్ధిదారులకు జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ కార్య క్రమంలో హైదరాబాద్ జిహెచ్ఎంసి జాయింట్ కమిషనర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ రెవిన్యూ ముకుంద రెడ్డి, డిఆర్ఓ వెంకటాచారి, సూపరిండెంట్ ఇంజనీర్ హౌసింగ్ వెంకట్ దాసు రెడ్డి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం, పిడి హౌ సింగ్ విజయ్ కుమార్, జిహెచ్ఎంసి అధికారులు, తహసిల్దార్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కల్లు కాంపౌండ్లపై ముమ్మరంగా 'ఎక్సైజ్ దాడులు '

**-మూడు ఎస్‌టిఎఫ్ టీమ్‌ల ఆధ్వర్యంలో తనిఖీలు**

**-ధూల్‌పేట్, గుడిమల్కాపూర్‌లలోని కాంపౌండ్‌లల్లో శాంపిల్స్ సేకరణ**

**-అనుమతిలేని కల్లు నేలపాలు..పలువురిపై కేసు నమోదు**



అనుమతి లేకుండా అమ్ముతున్న కల్లును పారబోసిన దృశ్యం

**హైదరాబాద్,జూలై 16,ప్రభాతవార్త:** కల్లు కంపౌండ్లపై ఎక్సైజ్‌శాఖ దృష్టిపెట్టింది. కల్తీకల్లుకు మరికొంత మంది బలికాకుండా ముందుస్తు చర్యలు చేపట్టింది. నగరంలోని పలు కాంపౌండ్లలో తనిఖీలు చేసి శాంపిల్స్ సేకరిస్తున్నారు. కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనతో హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరి కిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టర్ షానవాజ్ ఖాసీం కల్లు కంపౌండులపై పరిశీలించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు మూడు రోజుల నుంచి తెలంగాణ వ్యాప్తంగా కల్లు డిపోలపై ఎక్సైజ్ దాడులు నిర్వహిస్తున్నారు.ఈమేరకు బధవారం నగరంలోని దూల్‌పేట్ ఎఫ్‌టిఎఫ్ టీమ్ లీడర్ అంజి రెడ్డి అధ్వర్యంలో మూడు చోట్ల దాడులు నిర్వహించారు. మూడు కేసులు నమోదు చేశారు.దూల్‌పేట్ మల్లాకుంట ప్రాంతంలో బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న 70లీటర్ల కల్లును పట్టుకున్నారు. ఈ కల్లు శాంపిల్ తీసుకొని మిగిలిన కల్లును నేలపాలు చేశారు. ఈ కేసులో మల్లప్పాఅనే వ్యక్తిని అరెస్టు చేసి ఎస్. బసవరాజ్‌పై కూడ కేసు నమోదు చేశారు.అలాగే మంగళ్‌హట్ ప్రాంతంలో 247 లీటర్ల కల్లుకు అనుమతి లేకపోవడంతో వాటిని నేల పాలు చేసి బి. అనిల్ గౌడ్ అనేవ్యక్తిని అరెస్టు చేశారు. ఇదే కేసులో రామచంద్రయ్య అనే వ్యక్తిపైనా కేసు నమోదు చేశారు. అలాగే గుడి మల్కాపూర్ హీరా నగర్‌లో అనుమతి లేని కల్లు డిపోలోని 382 లీటర్ల కల్లును పారబోసి గోదా రాఘవేందర్ గౌడ్‌ను అరెస్టు చేసి ఈ కేసులో రామకృష్ణా గౌడ్‌పై కేసు నమోదు చేశారు. ఈ మూడు కేసులను ధూల్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. మరో రెండు కేసుల్లో ఎస్ టిఎఫ్‌సీ టీమ్ సీఐ వెంకటేశ్వర్లు టీం, ఎస్‌టిఎఫ్‌డి టీమ్ సీఐ నాగరాజు అధ్వర్యంలో శేరిలింగంపల్లిలో కల్లు డిపోలపై దాడులు నిర్వహించి శాంపిళ్లను సేకరించారు.

## ఒ.యూ ట్రాఫిక్ పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్



తార్నాక ప్రధాన రోడ్డులో డ్రింక్ అండ్ డ్రై నిర్వహిస్తున్న ఇన్స్‌పెక్టర్ సిహెచ్. సుధాకర్ రావు

**తార్నాక, జులై 16 ప్రభాతవార్త :** అవును హైదరాబాద్ లో పోలీసులు ఎప్పుడు పడితే అప్పుడు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం కూడా ఈ తనిఖీలు ఉంటున్నాయి. బుధవారం మధ్నాహ్నం ఒ.యూ ట్రాఫిక్ పోలీసులు మధ్నాహ్నం కూడా డ్రంక్ అంద్ డ్రైవ్ నిర్వహించారు. కాబట్టి మద్యం సేవించి వాహనాలు నడపకుండా ఉండటం మంచిది. ట్రాఫిక్ పోలీసులు ఎక్కడైనా, ఎప్పుడైనా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ సిహెచ్. సుధాకర్‌రావు మాట్లాడుతూ బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో 30ఎంజి కంటే ఎక్కువ మోతాదులో మద్యం ఉన్నట్లయితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం, దీనికి జరిమానా, జైలు శిక్ష కూడా విధించవచ్చన్నారు.. ఇలాంటి చర్యల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందన్నారు. కాబట్టి మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపకుండా ఉండటం మంచిదని సూచించారు. ఈ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరు కారు డ్రైవర్లు, మరో ఐదు ద్విచక్రవాహన దారులు పట్టుబడ్డారని ఇన్స్‌పెక్టర్ పేర్కొన్నారు. ఎస్సై మనోహర్ రెడ్డి, ఏఎస్ఐలు మౌలాలి, వెంకట్‌రావు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ బకాయిలపై ముమ్మరంగా "స్పెషల్‌డ్రైవ్"

**-బిల్‌స్టాప్, లింక్ సర్వీస్‌లను గుర్తించి బిల్లు వసూలు**

**- ఛీఫ్ ఇంజనీర్ పాండ్యా నాయక్**



తనిఖీల్లో పాల్గొన్న సి.ఈ పాండ్యానాయక్, జి.ఎం అంజయ్య, ఏడీఈ అంబేద్కర్ తదితరులు

**హైదరాబాద్, జూలై 16,ప్రభాతవార్త:**
టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశానుసారం విద్యుత్ బకాయిలపై స్పెషల్‌డ్రైవ్ ముమ్మరంగా సాగుతున్న రంగారెడ్డి జోన్ ఛీఫ్ ఇంజనీర్ పాండ్యా నాయక్ అన్నారు. ఈమేరకు బుధవారం జనరల్ మేనేజర్ పి.అంజయ్యతోకలిసి నగర శివారులోని మణికొండ ప్రాంతంలో పర్యటించి పెద్దమొత్తంలో బకాయిఉన్న బిల్‌స్టాప్ సర్వీస్‌లను తనిఖీ చేయడంతోపాటు వాటి లింక్ సర్వీసులను కూడా గుర్తించారు. స్థానిక పంచవటి కాలనీలో ఉన్న ఓ సర్వీస్‌పై 85లక్షల బకాయిలకు రెండు సార్లు నోటీసులు, 15రోజుల గడువు ఇచ్చినా స్పందించలేదని దీంతో వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే గచ్చిబౌలి, రాజేంద్రనగర్, సరూర్‌నగర్ సర్కిల్‌లలో పేరుకుపోయిన మొండిబకాయిలను వసూలు చేయడంతోపాటు హెచ్‌టి,బిల్‌స్టాప్ సర్వీస్‌లను తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో గచ్చిబౌలి ఎస్ఏవో రవికుమార్, ఇబ్రహీంబాగ్ ఏడీఈ అంబేద్కర్,ఏఈ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర డిజిపిని కలిసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



డిజిపికి వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

**అల్వాల్, జూలై 16 ప్రభాతవార్త:**
మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బుధవారం రాష్ట్ర డిజిపిని కలిశారు. అల్వాల్‌లో బోనాలను పురస్కరించుకుని చెక్కులు పంపిణీ సందర్భంగా ప్రోటోకాల్ విషయంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ శ్రేణులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇరు వర్గాలు తప్పు మీదంటే మీదని వాదించుకోవడం జరుగుతోంది. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నేతలు గాయ పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబిత అనిల్ కిషోర్ ఇతర ముఖ్య నేతలుతో కలిసి డిజిపి డాక్టర్ జితేందర్ ను కలవడం జరిగింది. కాంగ్రెస్ నేతలు జరిపిన దాడులు తదనంతరం జరిగిన పరిణామాలను ఎమ్మెల్యే వివరించారు. సమగ్రమైన నివేదిక పరిశీలన అనంతరం చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డిజిపి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం సైబరాబాద్ సిపి అవినాష్ మహంతిని కలిసి జరిగిన ఘటనను వివరించారు.కార్యక్రమంలో నేతలు బద్దం పరశురామి రెడ్డి, మురుగేష్, లడ్డు నరేందర్ రెడ్డి, అనిల్ కిషోర్, మోసిన్, సందీప్ పాల్గొన్నారు.

## గంజాయి పై లాలాగూడ పోలీసులు అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**తార్నాక, జులై 16 ప్రభాతవార్త :** సీసీ కెమెరాలు ఏర్పాటు.... గంజాయి పై లాలాగూడ పోలీసులు అవగాణ సీసీ కెమెరాలు ఏర్పాటు ఉపయోగం, గంజాయి పై లాలాగూడ పోలీసులు బుధవారం లాలాపేట్ కమాన్ మార్కెట్ వద్ద ప్రజలకు అవగాహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేరాలు అరికట్టడానికిని, భద్రతను పెంచడానికి సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని పోలీసులు తెలిపారు. సిసిటివి కెమెరాల ఉపయోగం, 100 డైల్ ఉపయోగాలు, మహిళలపై నేరం, సైబర్ నేరం, గంజాయి గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు అమర్ సింగ్, యుగేందర్‌తో పాటు పోలీస్ సిబ్బంది, బీసీ..2 సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు.శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కల్గించినా తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

## నూతన శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు



ప్రసంగిస్తున్న ప్రముఖ సాంకేతిక నిపుణులు సంజయ్‌కుమార్

**చిక్కడపల్లి, జూలై 16 ప్రభాతవార్త:** నూతన శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ప్రముఖ సాంకేతిక నిపుణులు, సాన్ షా ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అటానమస్ కళాశాలలో కంప్యూటర్ విభాగం వారు "ఎక్స్పర్ట్ టాక్ సిరీస్" అనే అంశంపై అతిథి ప్రసంగం చేశారు. సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కంప్యూటర్ విద్యని కేవలం పుస్తకాల ద్వారానే కాకుండా కంప్యూటర్ సిస్టంలో ప్రాక్టికల్ ప్రయోగాత్మకంగా ఏ విధంగా చేయవచ్చు వివరించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ విభాగాధిపతి రూప, ఫ్యాకల్టీ, విద్యార్థులు (బి.యస్సి) ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు సంజయ్ కుమార్ సూచించిన విధంగా ప్రయోగాత్మకంగా ల్యాబ్ ఉపయోగించుకొని ప్రయోజనం పొందాలన్నారు.

## గంధంగూడలో ఎస్‌టిపి ప్లాంట్లు పెట్టవద్దని వినతి

**నార్సింగి, జూలై 16 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని గంధంగూడలో ఎస్‌టిపి ప్లాంటును పెట్టవద్దని కోరుతూ బుధవారం కాంగ్రెస్ నాయకులు జల మండలి అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు హరీష్ గౌడ్ మాట్లాడుతూ విఘ్నేశ్వర కాలనీ, బృందావన్‌కాలనీ, కేకే-2, దత్తాత్రేయ కాలనీల మధ్యన జల మండలి అధికారులు ఎస్‌టిపిని పెట్టేందుకు ప్రణాళికలు రూపొందించడంను వెంటనే విరమించుకోవాలన్నారు. వందలాది మంది ప్రజలు ఉంటున్న ఈ ప్రాంతంలో ఎస్‌టిపి ప్లాంటును ఏర్పాటు చేస్తే వాతావరణ కాలుష్యం, శబ్ద కాలుష్యం ఏర్పడుతుందని, స్థానిక ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతారన్నారు. ప్రజలు లేని ప్రాంతాలలో ఈ ఎస్‌టపిలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి కాలనీ ప్రజల సమస్యను వివరించామని, ఆయన స్పందిస్తూ గంధంగూడ వద్ద కాకుండా మరో ప్రాంతంలో ఈ ప్లాంటును పెట్టాలని జల మండలి అధికారులకు సూచనలు చేశారని హరీష్‌గౌడ్ వివరించారు.

# సంపూర్ణ మద్యనిషేదం అమలు చేయాలి : ఆర్. కృష్ణయ్య

**హైదరాబాద్, జూలై 16,ప్రభాతవార్త:**
దేశంలో మహిళకు సరైన రక్షణ, గౌరవం దక్కాలంటే దేశ వ్యాప్తంగా సంపూర్ణ మద్యనిషేదం అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా ప్రధానకార్యదర్శి శ్రావణి అధ్యక్షతన బుధవారం కాచిగూడ లోని అభినందన్ గ్రాండ్లో జరిగిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తో కలిసి ఆయన పాల్గొని ప్రసంగించారు. మద్యనిషేద అమలుకు కేంద్ర, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఆయన కోరారు. మహిళలను అంగడి బొమ్మలుగా, ఆట వస్తువులుగా చూపిస్తూ మహిళ గౌరవాన్ని కించపరుస్తూ వస్తునా సినిమాలపై సెన్సార్బోర్డు కఠిన చర్యలు తీసుకునే విధంగా తగు సూచనలు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా, పారిశ్రామికంగా ఉన్నతంగా ఎదగాలంటే మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించినప్పుడే మహిళలకు సరైన న్యాయం జరుగుతుందన్న ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు. బీసీ మహిళలకు సబ్కటా దక్కకపోతే మహిళా బిల్లుకు సార్థకతే లేదన్నారు. ఇప్పటికే రాజ్యసభ, లోక్సభలో ఆమోదం పొందిన మహిళా బిల్లుపై గొంతులు చించుకొని మాట్లాడే రాజకీయ పార్టీల నేతలు బీసీ మహిళల గురించి, వారికి జరుగుతున్న అన్యాయాల గురించి, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ఆయన ప్రశ్నించారు. మహిళల పక్షపాతి అయిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్ని రంగాలలో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఆలోచిస్తున్నారని, బీసీ మహిళలకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, కరుణ, పి. సుధాకర్, జి.మల్లేష్, తంగెళ్లమూడి నంద గోపాల్, జిల్లాపెల్లి అంజి, పగిళ్ల సతీష్, పృధ్వీగౌడ్, శ్రీకాంత్, కవిత, స్వామి గౌడ్, హరి తిలకిసింగ్, సజిదా, బాలయ్య, రవి యాదవ్, నిఖిల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ, శ్రావణి తదితరులు

# సామాన్య ప్రజలకు సరిపడా నీటిని సరఫరా చేయాలి : బిఆర్ఎస్

**నార్సింగి, జూలై 16 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో జల మండలి అధికారులు, సిబ్బంది అలసత్వం కారణంగా సరిపడ నీరు సరఫరా లేక సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు. బుధవారం మణికొండ మున్సిపాలిటీలో పేద ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను తీర్చాలని కోరుతూ జల మండలి అధికారులకు బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ జల మండలి అధికారులు ఇబ్బడిముబ్బడిగా ప్రజల నుంచి బిల్లులు వసూలు చేస్తున్నారని, అదే స్థాయిలో నీటిని సరఫరా చేయలేక పోతున్నారన్నారు. సిబ్బంది చేతి వాటం కారణంగా సామాన్య ప్రజలుండే బస్తీలకు సరిపడా నీటి సరఫరా అవ్వడం లేదని, బడా బడా అపార్టుమెంట్లకు, గేటెడ్ కమ్యూనిటీలకు మాత్రం గంటల తరబడి నీటిని సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల వద్ద నుంచి అన్ని ఇళ్లకు సమానంగా నీటిని సరఫరా చేసేందుకు వాల్వులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రత్యేక ఫీజులు వసూలు చేసినా సవ్యంగా నీరు రాక ప్రజలు వర్షాకాలంలోనూ అవస్థలు పడుతున్నారన్నారు. అల్కాపూర్, ఎల్ఐసి కాలీనల్లో ఆర్భాటంగా నీటి రిజర్వాయర్లను ప్రారంభించారని,



నీటి సరఫరాను సవ్యంగా చేయాలని కోరుతూ జల మండలి అధికారులకు వినతిపత్రం ఇస్తున్న మణికొండ బిఆర్ఎస్ నాయకుల దృశ్యం.

కానీ నీటి సమస్యను మాత్రం పరిష్కరించడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం 240.గజాల ఇళ్లకు ఓసిలు జారీ చేయాల్సిన అవసరం లేదని, కానీ ఓసీలు లేని కారణంగా ఇష్టానుసారంగా ప్రజల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ దోపిడిని వెంటనే అధికారులు ఆపేయాలని వినతిపత్రంలో కోరామని వివరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ధన్‌రాజ్, నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు అండె, రూపారెడ్డి, రాజేంద్రప్రసాద్, సంగం శ్రీకాంత్, కిరణ్, శ్రీధర్, బాబురావ్, ఆరిఫ్, సుమ నళిని, భానుచందర్, మాల్యాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# బోనాల ఏర్పాట్లను పూర్తి చేయండి : ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

**సికింద్రాబాద్, జూలై 16 ప్రభాతవార్త:**
చారిత్రాత్మక చిలకలగూడ కట్ట మైసమ్మ దేవాలయంతో పాటు సికింద్రాబాద్ పరిధిలో ఆది, సోమవారాల్లో జరిగే బోనాలు వేడుకలు వైభవంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు జరుపుతున్నామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ తెలిపారు. బోనాలు ఏర్పాట్లలో అధికారులు అలసత్వం వహించరాదని, భక్తులకు ఇబ్బంది కలిగిస్తే తీవ్ర చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. చిలకలగుడా కట్ట మైసమ్మ దేవాలయాన్ని పద్మారావు గౌడ్ బుధవారం సందర్శించి, బోనాలు ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయం ప్రాంగణంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయం ఛైర్మన్ గుంటి కృష్ణ, కార్యనిర్వహణాధికారి మహేందర్ గౌడ్, జీ.హెచ్.ఎం.సీ. డిప్యూటీ కమీషనర్ ఆంజనేయులు, చిలకలగుడా ఇన్స్పెక్టర్ అనుదీప్, ట్రాన్స్ కో , జలమండలి, బల్దియా, ట్రాఫిక్ అధికారులు కౌశిక్, కుశాల్, శ్రీకాంత్, వెంకటేశ్వర్ రావు, శ్రీనివాస్, బీ.ఆర్.ఎస్. యువ నేత తీగుల్ల రామేశ్వర్ గౌడ్ లతో పాటు అధికారులు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ జీ.హెచ్.ఎం.సీ. ద్వారా రోడ్డు మరమ్మత్తులు, పరిశుభ్రతను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదనపు సంఖ్యలో



అధికారలో సమావేశమైన ఎమ్మెల్యే పద్మారావగౌడ్

పోలీసు సిబ్బందిని నియమించాలని, ప్రత్యేకంగా 30 సీ.సీ. కెమెరాలను ఆలయం పరిసరాల్లో ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. మూడు రోజుల పాటు మంచి నీటి సరఫరా చేపట్టాలని జలమండలి అధికారులకు సూచించారు. జాతర జరిగే చిలకలగుడా ప్రాంతంలో ప్రత్యేకంగా మంచి నీటి ప్యాకెట్లను అందించాలని సూచించారు. పండుగల రోజుల్లో విద్యుత్ సరఫరాలో కోతలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని, హక్కుదారుల గౌరవ బృతి పెంపు చిలకలగుడా కట్ట మైసమ్మ దేవాలయం హక్కుదారులకు చెల్లించే గౌరవ బృతి పెంచాలని హక్కుదారులు ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. వారికి రూ.10 వేల చొప్పిన చెల్లించాలని అధికారులకు పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా సూచించారు.

## క్రైస్తవ మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేస్తా : మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**చిక్కడపల్లి, జూలై 16 ప్రభాతవార్త:** రాష్ట్రంలో క్రైస్తవ మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడంతో పాటు 'మహిళాసంక్షేమ నిధి'ని ఏర్పాటు చేయడానికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హామీ ఇచ్చారు. బుధవారం క్రైస్తవ మహిళా ప్రతినిధి బృందం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను తెలంగాణ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ (టియుసిపిఏ) మహిళా ఇన్‌చార్జ్ డాక్టర్ సి. హేమలత యూత్ ఇన్‌చార్జ్ ఎం. షాలిని నేతృత్వంలోని ప్రతినిధి బృందం కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రా న్ని సమర్పించింది. మహిళా సంక్షేమ నిధి, కమ్యూనిటీ ప్రాతినిధ్యం కోసం నామినేటెడ్ పదవుల కేటాయింపుల్లో మహిళా న్యాయవాదులకు న్యాయం చేయాలని కోరారు. క్రైస్తవ మహిళా స్వయం సహాయక సంఘాలకు అంకిత మైన మహిళా సంక్షేమ నిధిని, సమాజ జనాభా శాతానికి అనుగుణంగా ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. అంతేకాకుండా స్వయం సమృద్ధి కార్యక్రమాల ద్వారా క్రైస్తవ మహిళలను శక్తివంతం చేయడానికి ప్రభుత్వం మద్దతు ఇవ్వాలని



మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసిన తెలంగాణ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

మంత్రిని కోరారు. ప్రొటెస్టంట్ క్రిస్టియ న్ వర్గాల నుంచి తెలంగాణ ప్రభుత్వంలో వైస్ చైర్మన్, డైరెక్టర్లు నామినేటెడ్ పదవుల కేటాయింపులో గోనె సాల్మ న్‌రాజ్ కు చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించాలని మంత్రిని కోరారు. రాష్ట్ర పాలనలో క్రైస్తవ మైనారిటీ సమాజానికి ఎక్కువ ప్రాతినిధ్యం, గుర్తింపును నిర్ధారించే దిశగా నామినేటెడ్ పదవులను కేటాయిస్తే ఈ వర్గాలన్నీ ప్రభుత్వాన్ని వందశాతం అండగా ఉంటూ రాబోయే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి తీసుకురావడానికి ఇప్ప

## బోనాల ఉత్సవాలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

**చార్మినార్,జూలై 16 ప్రభాతవార్త :**
హైదరాబాద్ పాతబస్తీ లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి ఆలయంలో బుధవారం మెట్రో జోన్ చీఫ్ ఇంజనీరు సాయిబాబా, సౌత్ సర్కిల్ ఎస్ఈ సోమిరెడ్డి,టిజిఎస్‌పిటిసిఎల్ చార్మినార్ డిఈ ఎం.శ్రీధర్,ఫలక్‌నుమా ఏడిఈ రాజులు పూజలు నిర్వహించారు.అంతకు ముందు మెట్రో జోన్ చీఫ్ ఇంజనీరు సాయిబాబా పలువురు విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పాతబస్తీలోని ఉప్పుగూడ, లాల్‌దర్వాజ, మీరాలం మండి,శ్రీ అక్కన్న మాదన్న శ్రీ మహంకాళీ ఆలయాలను సందర్శించి విద్యుత్ ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండ అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.పలు ఆలయాల వద్ద అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు నెలకొల్పామని ఆయన తెలియజేశారు.కాగా ఆర్‌అండ్‌బి ఆధ్వర్యంలో పాతబస్తీలోని ఆలయాలు వద్ద ఏడు జనరేటర్లు ఏర్పాటు చేశారు. కాగా లాల్‌దర్వాజ సింహవాహినీ శ్రీ మహంకాళి కమిటి ప్రతినిధులు మెట్రో జోన్ సిఈ సాయిబాబా,ఎస్ఈ సోమిరెడ్డి,చార్మినార్ డిఈ శ్రీధర్,ఫలక్‌నుమా ఏడిఈ రాజును శాలువ కప్పి సన్మానించారు.



పూజలు నిర్వహిస్తున్న టిజిఎస్‌పిటిసిఎల్ మెట్రో జోన్ చీఫ్ ఇంజనీరు సాయిబాబా

## ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఉండాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్



లాల్ బజార్ మహంకాళి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,జూలై 16 ప్రభాతవార్త:**
ప్రజలంతా అమ్మవారి అనుగ్రహంతో సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. బుధవారం లాల్‌బజార్ చౌరస్తాలో ప్రసిద్ధిగాంచిన శ్రీ మహంకాళి దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటీ,దేవదాయ శాఖ అదికారులు, ఎమ్మెల్యేకు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి స్వాగ తం పలికారు.కార్యక్రమంలో ఆలయ క మిటీ అధ్యక్షులు మురళీ ముదిరాజ్, ఈఓ స త్య చంద్రా రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అండాలు, సీని యర్ కాంగ్రెస్ నాయకురాలు నాగినేని ఎసరిత పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాల రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టండి : కలెక్టర్ హరిచందన ఆదేశం

**హైదరాబాద్,జూలై 16,ప్రభాతవార్త:**
జిల్లాలో ప్రభుత్వ స్థలాలుఆక్రమణకు గురికాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హరిచంద్ర దాసరి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థలాల ఆక్రమణలను నిరోధించేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని, ప్రభుత్వ స్థలాలను కాపాడటం ప్రతి రెవెన్యూ అధికారి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాల రక్షణపై కలెక్టరేట్‌లో రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవోలు), మండల రెవెన్యూ అధికులు (ఎంఆర్ఓలు), కలెక్టరేట్ విభాగాల సిబ్బందితో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.చెరువుల పరిరక్షణ, భవన నిర్మాణ అనుమతుల విషయంలో ఉన్న ఆలస్యం, తగిన కారణాలు లేకుండా సిఫార్సులు చేయడం అలాగే నిరాకరించడం వంటి అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి ప్రతిపాదనకు సరైన వాస్తవాధారాలతో నివేదిక ఇవ్వాలని సూచించారు.అదేవిదంగా న్యాయ సంబంధిత కేసులపై సమీక్ష నిర్వహించి ముఖ్యంగా కోర్టు కేసులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. న్యాయస్థానాల గౌరవాన్ని కాపాడే విధంగా వ్యవహరించాలన్నారు.పెండింగ్‌లో ఉన్న అంశాలను తక్షణమే పరిష్కరించి,



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన తదితరులు

ప్రజలకు వేగవంతంగా సేవలు అందించాలన్నారు.తెలంగాణ జనాభాలో సుమారు మూడవ వంతు మంది హైదరాబాద్‌లో నివసిస్తున్న నేపథ్యంలో, ప్రతి శాఖ ప్రజల కోసం సమర్థవంతంగా, వేగంగా సేవలందించే విధంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ముఖుంద రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, లాఆఫీసర్ శ్రీధర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్, హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణ, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరామ్ తహసీల్దార్లు తదితరులు హాజరయ్యారు.

# ప్రయాణీకుల సేఫ్టీకోసం ఆటోలకు ప్రత్యేక స్టిక్కర్లు వేస్తున్నాం

**- మాదాపూర్ డివిజన్ ట్రాఫిక్ ఎసిపి చంద్రశేఖర్ రెడ్డి**

**నార్సింగి, జూలై 16 ప్రభాతవార్త :** ఆటోలలో వెళ్లే ప్రయాణీకుల సేఫ్టీ కోసం ఆటోలకు ట్రాఫిక్ విభాగం కేటాయించిన ప్రత్యేకమైన స్టిక్కర్లు అంటించడం జరుగుతుందని, ఇందుకు ఆటో డ్రైవర్లు అందరూ సహకరించాలని మాదాపూర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నార్సింగి కూడలిలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, ఎస్.ఐలతో కలిసి ఏసీపీ "మై ఆటో ఈస్ సేఫ్" అనే ప్రత్యేకంగా తయారు చేయించిన స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఆటోలలో వెళ్లే ప్రయాణీకులు ఈ స్టిక్కర్‌పై ఉన్న క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేస్తే ఆటోకు సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయన్నారు. ఈ స్టిక్కర్ ఉండడం వలన ఆటో డ్రైవర్లు కూడా నిబంధనల మేరకు నడుచుకునే వీలుంటుందని, ప్రయాణీకులకు తమకు ఏమీ కాదన్న భరోసా ఏర్పడుతుందన్నారు. ఇప్పటి వరకు నార్సింగి పరిధిలోని అన్ని



నార్సింగిలో మై ఆటో ఈస్ సేఫ్ అనే స్టిక్కర్లను ఆటోలకు అంటించిన ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు.

ఆటో అడ్డాల వద్ద నిలిచే 410.ఆటోలకు ఈ స్టిక్కర్లు వేశామని, ఇంకా మిగిలిపోయిన వాటికి త్వరలోనే వేస్తామని స్ప ష్టం చేశారు. ఓలా, క్యాబ్, ర్యాపిడో వంటి ఆటోలకు, జిల్లాల నుంచి వచ్చీ,పోయే ఆటోలకు ఈ స్టిక్కర్లు వేయలేదన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు, జవాన్లు పాల్గొన్నారు.

## చిక్కడపల్లి శ్రీవారి ఆలయం హుండి ఆదాయం రూ.27లక్షల16వేల701



లెక్కింపు నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, జూలై 16 ప్రభాతవార్త:**
చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి హుండి లెక్కింపు బుధవారం జరిగింది. మొత్తం 112రోజులకుగాను ఆలయానికి రూ.27 లక్షల16వేల701 ఆదాయం లభించింది. బుధవారం ఆలయం వ్యవస్థాయ వంశీయుడు జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో ఎస్.అన్నపూర్ణ, ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో నోట్లు రూ.25లక్షల54వేల688 కాగా, కాయిన్స్ రూపేణ రూ.1లక్ష62 వేల013, విదేశీ నగదులో భాగంగా అమెరికన్ డాలర్లు 147, సింగపూర్ డాలర్లు 10ను కొందరు అజ్ఞాతభక్తులు హుండిలో వేశారు. దేవాలయం అభివృద్ధి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆలయం నిర్వాహకులు కోరారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చిక్కడపల్లి శాఖ బ్యాంక్ అధికారులు, దేవాలయం సిబ్బంది తదితరులు లెక్కింపులో పాల్గొన్నారు.

## చాక్నవాడిలో బోనాల ఉత్సవాలు



మహంకాళీ అమ్మవారి దేవాలయంలో జరిగిన ఉత్సవాల్లో బిజెపి నాయకులు డి.గోపాల్‌జీ

**బేగంబజార్, జూలై 16ప్రభాతవార్త:**
ప్రతి యేటా మాదిరిగానే ఈయేడు కూడా గోషామహల్ చాక్నవాడి బోనాల ఉత్సవాలను అంగ రంగవైభవంగా నిర్వహించారు.గోషామహల్‌లోని చారిత్రాత్మకమైన అమ్మవారి దే వాలయంలో కుటుంబ సమేతంగా తెలంగాణ బిజెపి నాయకులు డి.గోపాల్‌జీ వచ్చి అమ్మవారి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## 17 నుంచి బోనాలు ప్రారంభం

**అఫ్జల్‌గంజ్,జూలై 16ప్రభాతవార్త:** బేగంబజార్‌లోని రాణా ప్రతాప్ బిడ్జి సమీపంలో ఉన్న చారిత్రాత్మకమైన భూలక్ష్మి ఆలయంలో ఈనెల 17వ తేది నుండి బోనాల ఉత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ పూజారులు దుర్గేష్,నరేష్‌లు పేర్కొన్నారు.ఆలయంలో బోనాల ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి యేటా మాదిరిగానే ఈయేడు కూడా 17వ తేదిన అమ్మవారి ఘటస్థాపన,19వ ఏతదిన రాత్రి పదకొండు గంటలకు అమ్మవారి కళ్యాణ మభహోత్సవం,ఆదివారం సాయంత్రం తొట్టెల ఊరేగింపు,వివిధ వేషదారణలతో శోభయాత్ర 21వ తేదిన సాయంత్రం నాలుగు గంటలకు అమ్మవారి రంగం,రాత్రి అమ్మవారి ఘట్టాల శోభయాత్ర తదితర కార్యక్రమాలను ఉంటాయన్నారు.తిరిగి 27న ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ,ఆగస్టు3వ తేదిన అమ్మవారి బండరా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈకార్యక్రమంలో పెద్దఎత్తున్న భక్తులు పాల్గొన్నవలసిందిగా కోరారు.

## దివంగత ఎమ్మెల్యే మాగంటి సేవలు మరువలేనివి

**యూసుఫ్‌గూడ, జూలై 16, ప్రభాతవార్త :**



జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చేసిన సేవలు ఎన్నటికీ మరువలేని వని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు వివేక్ గౌడ్ అన్నారు. బుధవారం యూసుఫ్‌గూడ క్యాంపు కార్యాలయంలో బోరబండ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత గోపినాథ్ పాల్గొన్నారు. ఈ నెల 27వ తేదిన బోరబండ 4,5 కాలనీలోని పీజేఆర్ గ్రౌండ్‌లో గోపినాథ్ సంతాప సభను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఉప ఎన్నికల్లో తిరిగి బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకునేందుకు నాయకులు కార్య కర్తలు శక్తి వంచనలేకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఎమ్మెల్సీ పోచపల్లి శ్రీనివాస్‌రెడ్డి, యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ తో పాటు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలకిచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ నెరవేరుస్తుంది



కార్మికనగర్‌లో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

**యూసుఫ్‌గూడ, జూలై 16, ప్రభాతవార్త :**
ప్రజలకిచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో నెరవేరుస్తుందని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. బుధవారం రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని కార్మికనగర్, బ్రహ్మశంకర్‌నగర్, టీ.అంజయ్యనగర్, రాజీవ్‌గాంధీనగర్ ప్రాంతాలలో జీహెచ్ఎంసీ సర్కిల్ 19 డిప్యూటీ కమిషనర్ రంజిత్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. రహమత్‌నగర్ చౌరస్తా వెడల్పు చేయాలని కార్మికనగర్, బ్రహ్మశంకర్‌నగర్ కమ్యూనిటీ హాళ్లను ఎస్పీఆర్ హిల్స్ లోని దళిత స్టడీ సెంటర్‌ను టీ.అంజయ్యనగర్, రాజీవ్‌గాంధీనగర్ కమ్యూనిటీ హాళ్లను హెచ్‌ఎఫ్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రతీక, ఫారెస్ట్ ఆఫీసర్ వెంకట్ కిషన్ పాల్గొన్నారు.

## తప్పిపోయిన పిల్లలను తల్లికి అప్పగించిన బాచుపల్లి పోలీసులు



**కొంపల్లి, జూలై 16, ప్రభాతవార్త**
రెండు నెలల క్రితం తప్పిపోయిన పిల్లలను బాచుపల్లి పోలీసులు, ఆపరేషన్ ముస్కాన్ టీం సంయుక్త ఆధ్వర్యంలో తల్లి చెంతకు చేర్చారు. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం.. గత రెండు నెలల క్రితం ఆడుకుంటూ పారిపోయిన పిల్లలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కి వెళ్ళారా అక్కడ రైల్వే పోలీస్ ఫోర్స్ పోలీసులు వారిని రక్షి ంచి హైదరాబాద్ జిల్లా బాలల సంరక్షణ గృహంలో పిల్లలని ఉంచారు. ఆ తర్వాత 15 రోజులకు పిల్లల తల్లి బాచుపల్లిలో తమ పిల్లలు కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేశారు. ఆపరేషన్ ముస్కాన్ టీం ఇన్చార్జి సబ్ ఇన్స్పెక్టర్ నజీర్ మియా, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు శ్రావణ్ కుమార్, ఏహెచ్‌టియు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ రెడ్డి వారి బృందం కలిసి బాచుపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్ కింద తప్పిపోయిన పిల్లల తల్లి నివసిస్తున్నట్లు తెలుసుకొని పిల్లలు ఇద్దరినీ ఆమె చెంతకు చేర్చారు. ఈ పిల్లలని, తల్లిని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బాలల సంక్షేమ కమిటీ ముందు హాజరు పరచగా పిల్లలను సంరక్షణ గృహంలో ఆశ్రయం ఇచ్చారు. తల్లికి స్వధార్ హోమ్‌లో ఆశ్రయం కల్పించారు. పిల్లలను తల్లికి భద్రంగా అప్పజెప్పిన ఈ కార్యక్రమంలో పోలీసు కానిస్టేబుల్ సుమన్, మహిళా కానిస్టేబుల్ జ్యోతి, ఏఎస్ఐ చక్రపాణి, హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమయస్ఫూర్తితో తప్పిపోయిన పిల్లలను తల్లి చెంతకు చేర్చినందుకు పోలీసు అధికారులు బాచుపల్లి సిబ్బందిని అభినందించారు.

## మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య..

**పేట్ బషీరాబాద్, జూలై 16, ప్రభాతవార్త :**
మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఐఓ ఇ.శ్రీనివాస్ ఎస్ఐపి తెలిపిన వివరాల ప్రకారం మృతుడు మహేష్ (21), అస్సాం నుండి దూలపల్లికి 15 రోజుల ముందు వచ్చి తన గ్రామ నివాసుడైన ప్రణబ్ దాస్ వద్ద ఉంటూ ఆంధ్ర పాలిమార్ కంపెనీలో పని చేస్తున్నాడు. మధ్యానికి బానిస అయ్యి, కుటుంబ సభ్యులకు దూరంగా ఉన్నాను అనే బాధతో మద్యం మత్తులో బుధవారం తెల్లవారుజామున ప్రశాంత్ నగర్, దూలపల్లికి దగ్గరలో గల ఫారెస్ట్ ఏరియా లో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రణబ్ దాస్ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

## మద్యం మత్తులో చెరువులో పడి వ్యక్తి మృతి..

**పేట్ బషీరాబాద్, జూలై 16, ప్రభాతవార్త :**
మద్యం మత్తులో చెరువులో పడి ఓ వ్యక్తి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఐఓ మహేశ్వర్‌రెడ్డి ఎస్ఐపి తెలిపిన వివరాల ప్రకారం గుండ్ల పోచంపల్లిలో నివాసం ఉంటున్న దొడ్డ మల్లేష్ (54)కు ఇద్దరు భార్యలు. కానీ వారిద్దరు అతనికి దూరంగా ఉంటున్నారు. అతను మద్యానికి బానిసై బుధవారం గుండ్ల పోంపల్లి నారాయణ చెరువులో కాలు జారి పడిపోయాడు. మల్లేష్ అక్క కరకపట్ల లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.



సికింద్రాబాద్ లోయర్ ట్యాంక్ బండ్ వద్ద మధాహ్నాం నడ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్

## విజయ హైస్కూల్లో ఇన్వెస్టిచర్ సెరమని



**కుషాయిగూడ, జూలై 16, ప్రభాతవార్త :** క్యాబినెట్ యూనివర్సిటీ.క్రమశిక్షణ,దేశభక్తి,ప్రతిభకు విద్యార్థులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని విజయ హై స్కూల్ కరస్పాండెంట్ కొప్పుల రాజేష్ పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని విజయ స్కూల్లో ఏర్పాటుచేసిన విద్యార్థి క్యాబినెట్ ప్రమాణస్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. క్రమశిక్షణ ప్రతిభకు ఆలవాలమైన విజయ హైస్కూల్ కాప్రాలో హైస్కూల్ విద్యార్థుల చేత ఇన్వెస్టిచర్ సెరమని కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా హైస్కూల్ స్థాయిలో వివిధ విభాగాల నుండి బ్లూ,గ్రీన్, ఎల్లో,రెడ్ విభాగాల నుండి నాయకులుగా హై స్కూల్ విద్యార్థులను ఓటింగ్ ద్వారా ఎన్నుకొని,నియమించి సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కార్యక్రమం కొనసాగించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొప్పునూరి రాజేష్ విద్యార్థులకు ధ్వజాలను అందించి,వారిని ఉద్దేశించి మాట్లాడుతూ..క్రమశిక్షణ లేని చదువు చుక్కాని లేని నావ లాంటిది, విద్యార్థికి చదువుతో పాటు క్రమశిక్షణ అవసరం.అవి నాణేనికి బొమ్మ బొరుసు లాంటివ"ని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొప్పునూరి వీణ,ప్రిన్సిపల్ దేవినేని వెంగబాబు ,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తా

**-నవీన్ గౌడ్ సేవలు ప్రజలు మర్చిపోరు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**



శ్రీరామ్ నగర్‌లో ఏర్పాటు చేసిన నీటి కనెక్షన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ జూలై 16,ప్రవాతవార్త :** సొంత నిధులతో ప్రజల కోసం నీటి కనెక్షన్లు ఏర్పాటు చేసిన నవీన్ గౌడ్ సేవలు ప్రజలు మర్చిపోరని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా డివిజన్ శ్రీరామ్‌గర్ డబుల్ బెడ్ రూమ్ డిగ్నిటీ కాలనీ మంజీరా నీటి సరఫరా ప్రారంభానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విచ్చేశారు.ఈ సందర్భగా స్వంత నిధులతో కాప్రా ఒకటవ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు బైరి నవీన్ గౌడ్ నీటి కనెక్షన్ ఏర్పాటు చేసిన మంచినీటి సరఫరా కనెక్షన్ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రజల కోసం ప్రజాసేవ కార్యక్రమాల కోసం ఆలోచించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి అన్నారు. నవీన్ ఏర్పాటుచేసిన నల్ల కనెక్షన్ అభినందనీయం అని ఆయన అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, అభిమానులు, పాల్గొన్నారు.

## పోచమ్మ దేవాలయంలో గ్రానైట్ ఫ్లోరింగ్ పనులు ప్రారంభం



పోచమ్మ దేవాలయంలో ఫ్లోరింగ్ పనులను ప్రారంభిస్తున్న ఆలయ ప్రతినిధులు తదితరులు

**మలక్ పేట ,జూలై 16, ప్రభాతవార్త:** మలక్ పేట లోని శ్రీ పోచమ్మ దేవాలయంలో గ్రానైట్ ఫ్లోరింగ్ పనులు శనివారం ప్రారంభం అయ్యాయి. మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల , స్థానిక నాయకులు సైపుద్దీన్ షఫీ, రాష్ట్ర ప్రభుత్వ సాజన్యంతో దేవాలయంలో రూ. 2.50 లక్షలతో చేపట్టిన గ్రైనేట్ ఫ్లోరింగ్ పనులను పిటి శంకర్ ముదిరాజ్, తులసి సురేష్ కుమార్, కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి, ముప్పిడి శ్రీనివాసులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు మాట్లాడుతూ దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం గ్రానైట్ ఫ్లోరింగ్ నిర్మాణం పనుల కోసం రూ. 2.50 లక్షల నిధులు కేటాయించినందుకు మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే బలాల, స్థానిక నాయకులు సైపుద్దీన్ షఫీ,రాష్ట్ర ప్రభుత్వంకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ ఓబిసి సెల్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్, పిటి శ్రీధర్ ముదిరాజ్, టిన్నుసింగ్, ఘటం బాబా గౌడ్, ఆలయ పూజారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదం : కోచ్ కృష్ణ




గ్రాప్ లింగ్ పోటీలలో బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కోచ్ ఆదిమూల కృష్ణ తదితరులు

**మలక్ పేట ,జూలై 16, ప్రభాతవార్త:** ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో దోహదపడతాయని రా కంబాట్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ ఆదిమూల కృష్ణ పేర్కొన్నారు. నగరంలో ఇటీవల జరిగిన తెలంగాణ ఓపెన్ గ్రాప్ లింగ్ పోటీలలో నింబోలి అడ్డలోని రా కం బ్యాట్ స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మాస్టర్ గ్రూప్ స్కూల్ విద్యార్థులు తమ సత్తాను చాటారు. గ్రాఫ్ లింగ్ పోటీలలో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులను కోచ్ ఆదిమూలకృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ లో నూతనంగా చేర్చిన గ్రాప్ లింగ్ పోటీలకు మంచి ఆదరణ లభిస్తుందని అన్నారు. గ్రాప్ లింగ్ క్రీడలపై విద్యార్థులు మంచి ఆసక్తిని చూపిస్తున్నారని వివరించారు. గ్రాప్ లింగ్ పోటీలలో రా కం బాట్ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన 10మంది విద్యార్థులు బంగారు పతకాలు, 5 మంది విద్యార్థులు రజత పతకాలు, 9 మంది విద్యార్థులు కాంస్య పతకాలు సాధించారని వివరించారు. ఈ కార్యక్రమంలో రూపేష్ మత్ తదితరులు పాల్గొన్నారు.



వనస్థలిపురం హుడా ఆడిటోరియం సమీపంలో గల శ్రీ మహంకాళీ అమ్మవారి ఆలయంలో ఈనెల 20 న జరిగే అమ్మవారి బోనాల ఉత్సావాలకు రావలసిందిగా కోరుతూ ఆలయకమిటి ఫౌండర్ చైర్మన్ నీళ్ల అంజన్ కుమార్ గౌడ్ రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి కి ఆహ్వాన పత్రికను అందజేశారు.

## ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి : మంద కృష్ణ మాదిగ



**నేరెడ్ మెట్, జులై 16,ప్రభాతవార్త :** వికలాంగులకు,పెన్షన్ దారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్ పెంచి అందించడంతోపాటు వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరిలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 13న హైదరాబాదులో జరగనున్న వికలాంగుల, చేయూత పెన్షన్దారుల మహా గర్జన సభ విజయవంతం చేయాలని సన్నాహ సదస్సు జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ దారులకు ఇచ్చిన హామీని రేవంత్ సర్కారు వెంటనే అమలు చేయాలని లేదంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎన్నికల ముందు పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చి ఎన్నికల్లో గెలుపొంది 19 నెలలు గడుస్తున్న ఇచ్చినా హామిని నిలబెట్టుకపోవడం సరికాదని తెలిపారు. వికలాంగుల పెన్షన్ 6000కు,చేయూత పెన్షన్ 4వేలకు కండరాల క్షీణత వారికి పెన్షన్ 15 వేలకు పెంచాలని,వికలాంగులకు ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన ప్రతి ఒక్కరికి మంజూరు చేయాలని వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలని సూచించారు.13 ఆగస్టు హైదరాబాద్ ఎల్ బి స్టేడియంలో జరిగే వికలాంగుల మరియు చేయూత పెన్షన్దారుల మహా గర్జన సభకు లక్షలాదిగా కదలి రావాలని మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎన్ వినయ్,ఎమ్మెస్ పి జిల్లా అధ్యక్షులు కేశపాగ రామచందర్ మాదిగ,కళా మండలి నాయకులు ఎన్ వై అశోక్ మాదిగ, విహెచ్ పిఎస్ జిల్లా ఇన్చార్జి నరసింహ,ఎం జె ఎఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్,ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ప్రణయ్ మాదిగ,బచ్చలకూర స్వామి,సిల్వేరి శ్రీను,కేశవ్ అంజి, యాదగిరి,సలోమి, పరశురాం,బాల నరసింహ,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని పెన్షన్ దారులు, వికలాంగులు ఈ సభలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి : జెడ్ఇఓ అంకమ్మరావు



సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తున్న భాష్యం పాఠశాల విద్యార్థులు

**మలక్ పేట ,జూలై 16, ప్రభాతవార్త:** విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని భాష్యం పాఠశాల జోన్ 3 జెడ్ఇఓ అంకమ్మరావు పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ భాష్యం పాఠశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్ఇఓ అంకమ్మరావు పాఠశాల ప్రిన్సిపాల్ పల్లవి తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాష్యం విద్యా సంస్థలు విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతోపాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకత నైపుణ్యాలను కూడా ప్రోత్సహిస్తుందని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా నూతన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని 8, 9వ తరగతి విద్యార్థులకు డాన్స్ పోటీలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జోనల్ లెవల్ కు పంపించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంజాపూర్ కట్టమైసమ్మ దగ్గర బస్సులు ఆపాలని వినతి



ఇంజాపూర్ జోన్ బాధ్యులు మండల సత్యనారాయణ, సుందరయ్య నగర్ శాఖల కన్వీనర్ పోడేంద్ల శ్రీనివాసులు

**తుర్కయంజాల్ జులై 16, ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని 22, 23, 24 వార్డులో ఉండే సుందరయ్య కాలనీ, లక్ష్మీ నగర్ కాని , ఇందిరమ్మ కాలనీ, సాయినాథ్ కాలనీ, శ్రీరంగాపురం, శ్రీనివాస్ కాలనీ, ఆపిల్ రెవెన్యూ, బొక్క నారాయణరెడ్డి కాలనీ, సాయి ప్రియ కాలనీలు, తురకయంజాల్ కట్టకింద ఉన్న కాలనీవాసులు దాదాపు 5వేల జనాభా ప్రతిరోజు హైదరాబాద్ కి వెళ్లడం కానీ, దేవరకొండకు కు వెళ్లడం కానీ కట్ట పైకి రావాల్సిందే, బస్టాండ్ ఇంజాపూర్ కట్ట మైసమ్మ గుడి దగ్గర ఉన్నది గత రెండు మూడు నెలల కాలం నుండి ఇక్కడ ఆర్టీసీ బస్సులు సరిగా ఆపడం లేదు మార్నింగ్ నాలుగు గంటల నుండి పనుల కోసం పేదలు రోడ్డుపైన బస్సులు ఎక్కడానికి వస్తుంటారు బస్సులు సరిగా ఆపకపోవడంతో విద్యార్థులు మహిళలు కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అందువలన బస్సులను ఆపాలని ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్‌కి సిపిఎం పార్టీ సుందరయ్య నగర్ కాలనీ శాఖల ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా సిపిఎం ఇంజాపూర్ జోన్ బాధ్యులు మండల సత్యనారాయణ, సుందరయ్య నగర్ శాఖల కన్వీనర్ పోడేంద్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులు అదేవిధంగా హైదరాబాద్ నుంచి ఇబ్రహీంపట్నం వెళ్లే బస్సులు కట్ట మైసమ్మ టెంపుల్ దగ్గర ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య నగర్ సిపిఎం శాఖ కార్యదర్శి ఐతరాజు, కృష్ణ, శంకరయ్య, కేకుమార్, కే సత్యం, జి సాయి ఎం నరసింహ, జి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రద్ధాబాద్ మహంకాళి జాతర ఉత్సవాలకు సర్వం సిద్ధం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ తదితరులు

**సైదాబాద్, జూలై 16 ప్రభాతవార్త:** శ్రద్ధాబాద్ మార్కెట్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో గత 47 సంవత్సరాల నుంచి మహంకాళి జాతర మహోత్సవాన్ని ప్రతి ఏటా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. పాతనగరంలో జరిగే మహంకాళి జాతరలో సైదాబాద్‌లో జరిగే బోనాల జాతరకు ప్రత్యేక స్థానం ఉంది. జూలై 20వ తేదీన బోనాల పండుగ, 21 తేదీన అమ్మవారి ఘట ఊరేగింపు మధ్యాహ్నం 2.30కు ప్రారంభం కానుంది. మార్కెట్ కూడలి వద్ద సాయంత్రం 7.30కు గావు పట్టే కార్యక్రమాన్ని నిర హిస్తారు. 22వ తేదీ మంగళవారం సైదాబాద్ మార్కెట్‌లో అన్నదానం నిర్వహి స్తారు. అమ్మవారి ఘటాల ఊరేగింపులో పౌరాణిక, సాంఘీక వేషాధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. ఆర్కెస్ట్రా, పోతరాజుల నృత్యాలతో ఎసిపి కార్యాలయం నుంచి నుంచి బయలుదేరే ఊరేగింపు సైదాబాద్ పుర వీధుల గుం డా కొనసాగుతుంది. అనంతరం శ్రద్ధాబాద్ మార్కెట్ కూడలి వద్ద గావు పట్టే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

**మహంకాళి జాతర ఉత్సవ కమిటీ..**

శ్రద్ధాబాద్ మహంకాళి జాతర ఉత్సవ కమిటీ చైర్మన్‌గా జి. సుభాష్ చందర్జీ, అధ్యక్షుడిగా కె.మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కదారి రాంకుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీనివాస్ చందర్జీ, కోశాధికారిగా గౌలికార్ పూర్ణ చందర్, ఉపాధ్యక్షులుగా కూసూరు సహదేవ్ యాదవ్, గౌలికార్ దినేష్, కోళ్ల గోపి, సి.జైల్‌సింగ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎల్. సాయిబాబ, ఆశిష్ గౌలికర్, జి.అరవింద్, కె.సంపత్, సంయుక్త కార్యదర్శులుగా కె.సుభాష్, ఇ.వినయ్, హెచ్.వినేష్, కె.సంతోష్‌గౌడ్, సాంస్కృతిక కార్యదర్శులుగా జి.జైపాల్ రెడ్డి, పి. ఆనంద్, సలహాదారులుగా గౌరి శంకర్ గౌడ్, కావేటి జగన్నాథ్ కార్యవర్గ సభ్యులుగా జి.కిషోర్, ప్రవీణ్, ఎ.శ్రీనివాస్, కె.అశ్విన్, మహేష్, కె.సర్వోత్తమ్, సి.విజయ్, అభిషేక్ గౌడ్, ఎం.సుధీర్‌రెడ్డి, బి.క్రాంతిగౌడ్, గౌరి శంకర్, జి.అమిత్, ఎస్.శంకానంద్‌లు ఎన్నికయా ్యరు.

## అవినీతి అక్రమాలకు కేరాఫ్‌గా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్

**-కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు పరస్పరం సహకరించుకుంటూ ప్రోత్సహిస్తున్నారు**

**-బిజెపి రిలే నిరాహార దీక్షా శిబిరంలో అందెల శ్రీరాములు యాదవ్ ధ్వజం**



బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో అక్రమాలపై ధ్వజమెత్తుతున్న అందెల శ్రీరాములు యాదవ్: చిత్రంలో దీక్షలు చేస్తున్న బిజెపి ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జూలై 16 ప్రభాతవార్త :** మహేశ్వరం నియోజకవర్గంలో అవినీతి అక్రమాలకు నిలయంగా మారిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్, బిజెపిలు పరస్పరం సహకరించుకుంటున్నారని నియోజకవర్గ బిజెపి ఇంచార్జి, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ ఆరోపించారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో గడచిన ఐదు సంవత్సరాలలో ప్రభుత్వ భూములు, పార్కు స్థలాలు, ఓపెన్ ప్లేస్‌లు యధేచ్ఛగా అన్యాక్రాంతం, ఫిర్యాదులు వచ్చినా అధికారులు పట్టించుకోకపోవడం, అన్ని శాఖల్లో నిర్లక్ష్యం, అవినీతి, నిధుల దుర్వినియోగాన్ని నిరసిస్తూ బుధవారం బిజెపి రిలే నిరాహార దీక్షలకు దిగింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డిల సంయుక్త ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షా శిబిరానికి విచ్చేసిన ఆయన దీక్షలు చేస్తున్న నాయకులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి అక్రమాలు, కబ్జాల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులే ఉన్నారనీ ఇరు పార్టీల వారు ఒకరి కొకరు సహకరించుకుంటూ కబ్జాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కార్పొరేషన్ అధికారులు, అధికార పార్టీ నాయకులు కలిసి కార్పొరేషన్‌ను పూర్తిగా అవినీతిలో ముంచారని ఆయన ఆరోపించారు. కోట్లాది రూపాయల విలువ చేసే వేల గజాల పార్కు స్థలా లు, ఓపెన్ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని బిజెపి నాయకులు ఎన్నో సార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోని అధికారులు కబ్జాదారులకు సహకరించారని అందెల పేర్కొన్నారు. బిజెపి పేర్కొంటున్న కబ్జాలకు గురైన పార్కు, ఓపెన్ స్థలాలన్నింటినీ పరిరక్షించడానికి అధికారులు తక్షణమే కార్పొరేషన్ ఆధీనంలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిజెపి ఉధృతంగా పోరాటాలు చేస్తుందని శ్రీరాములు యాదవ్ హెచ్చరించారు. కాగా బిజెపి నేతల రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించిన రంగారెడ్డి జిల్లా రూరల్ బిజెపి మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి, జాతీయ కిసాన్‌మోర్చా నాయకుడు పాపయ్యగౌడ్, రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డిలు దీక్షలు చేస్తున్న వారికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ యెల్మేటి దేవేందర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తర్రె మల్లేష్ యాదవ్, కార్పొరేషన్ బిజెపి మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ఓబిసి మోర్చా నాయకుడు నడికుడ యాదగిరి, పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మద్ది రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేషన్ బిజెపి ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి,డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దడిగ శంకర్, మాజీ కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డి, మాజీ ఎంపిటిసి ఏనుగు రాంరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ పెత్తుల్ల పుల్లారెడ్డి, పార్టీ నాయకులు పాలుబాయి లక్ష్మణ్, మంత్రి మహేష్ ముదిరాజ్, రామిడి శూరకర్ణారెడ్డి, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నవారు శ్రీనివాస్‌రెడ్డి, కుంటి భాస్కర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా ఉదయం నుండి సాయంత్రం వరకు దీక్షలు చేసిన వారికి పార్టీ నాయకులు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు.

## 20న దుర్గా పోచమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలు

**వనస్థలిపురం జూలై.16.ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ శ్రీ దుర్గా పోచమ్మ చౌరస్తాలో గల శ్రీ దుర్గాపోచమ్మ ఆలయంలో ఈనెల 20 ఆదివారం అమ్మవారి బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ముద్దగౌని శేఖర్ గౌడ్ తెలిపారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, మహానైవేద్యం తదితర పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామని,సాయంత్రం ఫలహారం బండి సాహెబ్ నగర్ లోని చైర్మన్ నివాసం నుండి అతని తనయుడు సాంబశివ గౌడ్ భారీ ఊరేగింపు తో బయలుదేరి అమ్మవారి గుడికి చేరుకుంటు దన్నారు.భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి బోనాల పండుగలో పాల్గొనాలని శేఖర్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు కారింగి ప్రభాకర్ రెడ్డి,బీరం శ్రీధర్,ముద్దగౌని రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యం కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలి : కార్పొరేటర్



శ్రీపురం కాలనీ ప్రతినిధులతో కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం జూలై.16.ప్రభాతవార్త :** ప్రతినిత్యం కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలని బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. బుధవారం డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీలో కాలనీ ప్రతినిధుల పిలుపు మేరకు కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో పారిశుద్ధ్య పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దుర్వాసనకు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు తెలుసుకున్న అనంతరం ఆయన పారిశుద్ధ్య కార్మికుల ను పిలిపించి,చెత్తను తొలగింపజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు చెత్తను రోడ్లపై వేయకుండా, ఇంటి వద్దకు వచ్చే చెత్త రిక్షాలలో వేయాలన్నారు. ఈకార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు పద్మారెడ్డి,శ్రీధర్ రెడ్డి, ముత్యం రావు,చంద్రయ్య,నారాయణరెడ్డి, విట్టల్ రెడ్డి,సికిందర్ రెడ్డి,విష్ణువర్ధన్ రెడ్డి,పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిజ్జాదిగూడ 25వ డివిజన్‌లో వాటర్ ట్యాంక్ ప్రారంభం



వాటర్ ట్యాంకు ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, వెస్ట్ క్రాంతి కాలనీ వాసులు

**మేడిపల్లి ,జూలై 16 ప్రభాతవార్త ;** పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 25వ డివిజన్ వెస్ట్ క్రాంతి కాలనీ పోచమ్మ దేవాలయం కమ్యూనిటీ హాల్ లో 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొంతిరి హరి శంకర్ రెడ్డి తన సొంత నిధులతో వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షా , కార్యదర్శులు భక్తిశ్వర్, కళ్యాణ్, క్రిష్టయ్య, నర్సింహులు,శివరాజు, మల్లారెడ్డి, విజయ్ నాయక్,తిరుమలేష్, శ్రీనివాస్, యాదగిరి,క్రిష్ణ స్వామి, పాండు, శ్రీనివాస్, క్రాంతి , అసోసియేషన్ సభ్యులు, మహిళలు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## రూ. 5 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేత




**నేరెడ్ మెట్, జులై 16,ప్రభాతవార్త :** కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తోందని బ్యాంక్ సికింద్రాబాద్ డివిజన్ రీజినల్ హెడ్ బి. భాస్కర్ తెలిపారు. బుధవారం యాప్రాల్ బ్రాంచ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. యాప్రాల్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ చంద్రగిరిరాజు ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళా సభ్యురాలి కుటుంబానికి,కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ యూనియన్ రిన్ సురక్ష పాలసీ ద్వారా రూ. 5 లక్షల బీమా చెక్కును అందజేశారు. యాప్రాల్ కింది బస్తీకి చెందిన ఖతాదారురాలు పి. శోభ పాలసీ పొంది ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు బుధవారం శోభ కుటుంబ సభ్యులకు కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ యూనియన్ రిన్ సురక్ష పాలసీ ద్వారా రూ. 5 లక్షల బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బి. భాస్కర్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ యూనియన్ రిన్ సురక్ష పాలసీ పట్ల అవగాహన పొందితొటి సభ్యులకు పాలసీ గురించి వివరించాలని సూచించారు. ప్రమాద బీమా పాలసీల గురించి ఖాతాదారులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు.కార్యక్రమంలో కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు శివశంకర్,మోలానా,సిబ్బంది పాల్గొన్నారు.

## సైదాబాద్‌లో రోడ్ల వెంట చెట్ల కొమ్మల తొలగింపు




రోడ్ల మరమ్మత్తు పనులు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 16 ప్రభాతవార్త:** బోనాల పండుగను దృష్టిలో పెట్టుకుని సైదాబాద్ డివిజన్‌లో ఊరేగింపులు నిర్వహించే రోడ్లలో చెట్ల కొమ్మలను తొలగించారు. రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగ, ఊరేగింపు సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని అన్నారు.

**నూతన విద్యుత్ స్థంబాలు ఏర్పాటు చేయాలి..**

సైదాబాద్ డివిజన్‌లో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్థంబాల స్థానంలో వెంటనే కొత్త వాటిని ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడిఇ శోభన్‌బాబు, ఎఇ సోహైల్, లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## చదువు పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

**ఎల్.బి.నగర్, జులై 16 ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుకోట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని భాష్యం స్కూల్ సీఈఓ చైతన్య, జెడ్ఈవో అంకమ్మరావు పేర్కొన్నారు. ఆర్కేపురం భాష్యం హై స్కూల్ ఫ్రెషర్స్ డే వేడుకలు కొత్తపేట పద్మావతి శ్రీనివాస కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని విషయాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఇతర అంశాలపై కూడా అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పెరుగుతున్న పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు వ్యవహరించాలని సూచించారు. చదువు, క్రమశిక్షణ ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించగలుగుతారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిప్యూటీ మేయర్‌ను కలిసిన సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు



డిప్యూటీ మేయర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న డీసీ ఆంజనేయులు

**తార్నాక, జూలై 16 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ సర్కిల్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులు గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి లను తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారంపై ఆయనతో చర్చించారు.

## నూతన కమిటీ ఎన్నిక




విజయ డెయిరీ జనరల్ బాడి సమావేశంలో పాల్గొన్న ఐఎన్‌టీయూసీ బి...22 సభ్యులు

**తార్నాక, జూలై 16 ప్రభాతవార్త :** లాలాపేట్ లోని విజయ డైరీ లో ఐఎన్టీయూసీ బి 22 జనరల్ బాడి సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుత కార్యనిర్వాహక కమిటీ పదవీకాలం ముగిసిన నేపథ్యంలో నిష్పాక్షికమైన, ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నిక నిర్వహించారు. మెజారిటీ సభ్యుల మద్దతుతో కొత్త కార్యనిర్వాహక కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడుగా సాల యాదగిరి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా పోరిక అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా గోషిక బాల ప్రసాద్,జాయింట్ జనరల్ సెక్రటరీ గా కొండూరు శ్రీధర్,అడిషనల్ జాయింట్ సెక్రటరీలుగా విజయలక్ష్మి,ఉమా మాతురి,కోశాధికారిగా సపావత్ మౌనిక పత్తి.నిఖిల్ కుమార్, మహిళ టీం సభ్యులుగా ఆర్. విజయలక్ష్మి,హారతి,ఉదయశ్రీ, సలహాదారులుగా ఎండీ.మసులుద్దీన్ తదితరులను ఎన్నుకున్నారు.

## ఏఎస్ఐ అప్పాజీకి ఘనంగా వీడ్కోలు

**తార్నాక, జూలై 16 ప్రభాతవార్త :** బదిలీపై వెళ్లిన లాలాగూడ ఏఎస్ఐ అప్పాజీకి లాలాగూడ పోలీసులు ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్లో చేసిన సేవలను స్మరించుకొని ఆయనను సాలువతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.ఇన్స్పెక్టర్ రఘు బాబు,డిఐ రామకృష్ణ,ఎస్సైలు తోటి సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

## ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ



**తుర్కయంజాల్ జూలై 16,ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూరు పరిధిలో శ్రీరస్తు కన్వెన్షన్ హాల్లో నియోజకవర్గం లోని మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి హాజరై ఉచిత మైనార్టీ వర్గాల మహిళలకు 203 ఉచిత కుట్టు మిషన్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మైనార్టీ వర్గాల మహిళలకు 203 కుట్టుమిషన్లు అందజేస్తామని తెలిపారు, సెకండ్ విడతలో దాదాపు 500 మందికి కుట్టు మిషన్లు అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ : పారిజాత



లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, జూలై 16 ప్రభాతవార్త:** అర్హులైన పేదలకు వైద్య చికిత్సల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం రిలీఫ్ ఫండ్ అందిస్తున్నదని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో బుధవారం ఆమె సిఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులైన కేశవులు, నూర్ జాన్‌బేగం, అంజయ్య, భాస్కరాచార్యులు, కదారి బిక్షపతి కుటుంబాలకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పారిజాత మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చిగిరింత దయాసాగర్‌రెడ్డి, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, సుభాన్ యాదవ్, నీరుడు శ్రీరాములు, ఉమేష్, బద్దం రాముగౌడ్, జెల్ల రమేష్‌గౌడ్, నయనాచారి, గిరి ముదిరాజ్, మసూద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.